# అద్దం

రాజధానిలో అల్లర్లు, కర్ఫ్యూ. ప్రజాజీవితం స్థంభించి పోయిన దృష్ట్యా ప్రభుత్వం విఫలమైందని పత్రికల విమర్శ. నిరసనగా రాష్ట్రమంతటా బంద్. టర్నోవర్ టాక్స్ పెంచినందుకు వ్యాపారస్తుల పిలుపు. మరునాడు బంద్! తెల్లారి ఆదివారం !

మొదటి తారీకు నాటి నుండి, నాలుగో తారీకు వరకు దుకాణాలు తెరవలేదు. దుకాణాల్లో దుమ్ము, జన జీవనంలో యిబ్బంది పేరుక పోతుంది. చిన్న చిన్న వర్తకులకు రావలసిన బాకీలు పాత బాకీల పద్దుల్లోకి

చేరిపోతున్నవి. పెద్ద కొడుకు వసూళ్ళకు వెళ్లగా నారాయణ దుకాణం తెరచి కూర్చున్నాడు. గుమస్తా పిల్లవాడు తరాజును తుడుస్తూ వున్నాడు.

జనం అప్పుడప్పుడే వస్తున్నారు. కొందరు బాకీ బాపతు రూపాయిలు యిచ్చి సామానుకు సాయంత్రం వస్తామని చెప్పి వెడుతున్నారు. పదకొండు అయింది. రద్దీ బాగా పెరిగింది. వున్నట్టుండి దుకాణాల్లోని గుమస్తాలు పక్క దుకాణాల్లోకి పరుగులు, గుసగుసలు. కొందరు సేట్లు దుకాణాలు వదిలి పక్క కొట్లలోనికి వెడుతున్నారు. పక్క దుకాణపు గుమస్తా వచ్చి నారాయణ చెవిలో కూడా ఏదో చెప్పాడు. "సరే" అని తలవూపి తన పనిలో తాను మునిగిపోయాడు.

ఓ జీపు వచ్చి దుకాణం ముందు ఆగింది. ఇద్దరు దిగి ఎదురు దుకాణం లోకి ఒకరు, నారాయణ దుకాణంలోకి మరొకరు నడిచారు.

నారాయణ లేచి నిలుచోని నమస్కారం చెప్పాడు. ప్రతి నమస్కారం చేసినట్టు చేయి సైగచేసి "నేను ఎ.సి.టీ.వో.ను. దుకాణాన్ని ఇన్‌స్పెక్షన్ చేయాలి" అంటూ చేతిలోని డైరీని ఫైల్ ప్యాడ్‌ను, గల్లా పెట్టె మీద వుంచాడు.

"మొన్న డి.సి.టి.ఓ.గారు" అన్నాడు నారాయణ

వినయంగా.

"మాది స్పెషల్ పార్టీ. లెక్కల పుస్తకం యిలా యివ్వు" అంటూ పక్కనే వున్న స్టూల్ మీద కూర్చున్నాడు.

"ఏం స్పెషల్ పార్టో! ఏం మన్నే ! ఈ వ్యాపారం కంటే దొంగతనం చేసిందే మేలన్నట్టుంది" అంటూ లోలోపల గొణిగాడు.

"కిలో గోధుమ లివ్వండి" అంటూ ఓ కస్టమర్. జోకి యిచ్చాడు.

"గోధుమలన్నీ పుచ్చువా ?" కష్టమర్.

"మా పొలంలో పండినయి కావండి. గవర్నమెంట్ వాళ్ళిచ్చినవి" దొంగనుగూర్చిన ఆచూకి, పోలీసు వాళ్ళకు చెప్పినట్టు చెప్పాడు.

"రెండు కిలోల బియ్యం" ఓ స్త్రీ.

జోకి సంచిలో పోసిన బియ్యాన్ని చేతలోకి తీసుకొని చూసి, మళ్ళీ సంచిలోకి వదులుతూ "నూకలెక్కువ వున్నాయ్" అన్నది.

"బియ్యం గవర్నమెంట్ వాళ్ళిచ్చినవే, ధర వాళ్ళు నిర్ణయించిందే, మేము ఏమైనా జోకివ్వాల్సిందే ! వెనకట మేము స్వయంగా వ్యాపారం చేసేవాళ్ళం. మంచి సరుకులు - మంచి లాభాలు. ఇప్పుడు సర్కారు సర్కులు -

సర్కారు ధరలు ! మేము చేసేది అమాలే" అంటూ గుక్క తిప్పకుండా అనే సర్కి ఆమె నోరు కదపకుండా రోడ్డెక్కింది.

"రెండు రిన్ సబ్బులు, ఓ లక్స్ యివ్వండి" అంటూ అలమారల వైపు చూస్తున్నాడు ఓ కాలేజి విద్యార్థి.

"లక్స్ సుప్రీమా ? మామూలిదా ?" నారాయణ.

"సుప్రీమంటే చాలా బాగుంటదా?" అడిగాడు కుర్రాడు.

"బాగుంటదా అంటే బాగుండదూ మరి. స్పెషల్ చాయ్‌కు సాదా చాయ్‌కు తేడా వుండదా ?"

"వుంటది"

"ఈ రెంటిలో కూడా అంతే తేడా" అంటూ వోసారి ఎ.సి.టి.వో. గారి వైపు చూసి "ఈ కంపెనీ వాళ్లు ధరలు పెంచాలనుకున్నప్పుడు వస్తువు రంగును మార్చడం, ఆకారం మార్చడం, అసలైన బరువును తగ్గించి సుప్రీం, స్పెషల్ లాంటివి తగిలించి రేటును పెంచేస్తే, వున్న మహారాజులు కొంటనే వుండిరి!"

విద్యార్థి నవ్వి "అయితే సాదా సబ్బే ఇవ్వండి".

సబ్బులను యిచ్చాడు గుమస్తా. విద్యార్థి జేబులో నుండి డబ్బు తీసి నారాయణకిస్తూ మరో వైపు -

"నాకు తెల్సులేవయ్యా నేను వ్యాపారశాస్త్రమే చదువుతున్నా. దేశాన్ని మంచేస్తుండ్రు!".

"ఎవరు ముంచుతుండ్రు? నాయకులు. వాల్లెనుక

జండాలు పట్టుకొని జై కొడుతూ తిరగే మీరు ! వాళ్లను పెంచి పోషించేది బడా వ్యాపారులు కావచ్చు. మేము రోజు కూలీలం. నా మట్టకు నేను ముప్పై ఏండ్ల నుండి ఈ వ్యాపారం చేస్తన్నా .సాహుకారిని కాలేదు ! సన్నాసిని కాలేదు".

"అందరూ ముంచుతూనే వున్నారు" అంటూ తన సైకిల్ కదిలించాడు విద్యార్థి.

అంతవరకు వాళ్ళ సంభాషణ వింటూ తన పని తాను చేసుకుంటున్న ఎ.సి.టి.వో.గారు "అవును ఆ అబ్బాయికి సబ్బుల బిల్ ఎందుకివ్వలేదు?"

"బిల్ యిచ్చేవరకాగిండా సార్? వుపన్యాసం యిచ్చుకుంటు పోతనే వుండే."

"పర్చేజ్ బిల్స్ అన్నీ జమా ఖర్చు చేసినట్లేనా ?"

"చేయకపోతే ఎలా కుదురుద్ది?"

"కుదిరేదీ కుదరందీ నాకు తెల్సు గాని, గోదాం చూద్దాం పదా".

'అరె పిలగ నేను వొచ్చేవరకు ఏదీ అమ్మకు" అంటూ గల్ల పెట్టెకు తాళం వేసుకొని యిద్దరూ గోదాం వైపు నడిచారు.

**

"ఈ పుస్తకంలో రాసిన వాటికి, యిక్కడ వున్న నిలవలకు లెక్క కలవడం లేదు".

"అయ్యో" అంటూ చేతులు కట్టుకొని నిలుచున్నాడు.

"ఏది కరెక్ట్ ! పుస్తకమా స్టాకా?" అంటూ నారాయణ వైపు చూశాడు.

"టీ తాగుతారా సార్?".

"వద్దబ్బా యిప్పుడే తాగొచ్చా" మళ్ళీ పుస్తకంలో చూస్తూ.

"పోనీ కూల్‌డ్రింక్?"

ఓసారి నారాయణను, నారాయణ నిలుచొన్న తీరుని చూసి "తర్వాత తాగుదాం" అంటూ గోదాము నాలుగు మూలల కలియ జూస్తున్నాడు. నారాయణ మూలకున్న వో ఫోల్డింగ్ చేర్‌ను దుమ్ము దులిపి వేశాడు. దాని మీద కూర్చుంటూ "కేసు రాయక తప్పదయ్యా బాబు" అన్నాడు. నారాయణ కాళీ డబ్బాను తెచ్చి ముందుంచగ దాని మీద డైరీని, ఫైల్స్‌ని పెట్టి తెల్ల కాగితాన్ని తీసి, సైడ్‌ను మలుస్తున్నప్పుడు బయట సైకిల్‌కు స్టాండ్ వేసి లోనికొచ్చాడు ఓ యువకుడు.

"మా పెద్దోడు ప్రసాద్, కాలేజి చదువుతున్నాడు." మన ఎ.సి.టి.వో. గారు.

"నమస్కారం సార్"

"నమస్కారం ఏం చదువుతున్నావ్ ?"

"బిం.కాం. సార్"

"గుడ్ వృత్తికి తగ్గ చదువు" అంటూ కనుబొమ్మలను కదిలిస్తూ నారాయణ వైపు చూశాడు.

నారాయణ ముఖంలో కొంచెం నవ్వు పొడ కదిలింది.

"తమరికెందరు సార్ పిల్లలు?" నారాయణ సంభాషణను పొడిగిస్తూ.

"ఓ అమ్మాయి యిద్దరబ్బాయిలు".

"జమ రెండైతే, ఖర్చు ఒకటి, అదృష్టవంతులు".

"ఏం జమో! ఏం ఖర్చో! ఏదీ మన చేతిలో లేదు!"

"అవును అంతా వాని దయ"

నారాయణ జేబులో చేయిపెట్టి -

"మీది మీకు!...." అంటూ ఆఫీసర్ కళ్ళలోకి చూశాడు.

ఆఫీసర్ మౌనంగా నారాయణ వైపు చూశాడు.

ప్రసాద్ యిద్దరి వైపు చూశాడు.

నారాయణ జేబులోని నోట్లు ఆఫీసర్ జేబులోకి వెళ్ళినా ఆయన చూపుల్లో మార్పు కనిపించదు.

"కేసు తప్పదు".

"ముడుపు చెల్లించినా కేసా?" అన్నట్టు చూసాడు నారాయణ.

"ఈ రోజు ఓ రెండు కేసులు బుక్ చెయ్యమని మా పై అధికారి ఆర్డర్" రాసిన కాగితాలను పిన్‌చేస్తు.

"నాబోటి చిల్లర కొట్టోడే దొరికిండా సార్? మీకు వూళ్ళో యింకా ఎంతో".

"చూడు నారాయణగారూ, దొరికింది పరక అయినా చేపను పట్టానుగదా అనుకుంటాడు చేపలు పట్టేవాడు".

నారాయణకు చెమటలు పోస్తున్నాయి.

ప్రసాద్ గోడకు ఆనుకొని నిల్చొని అంతా గమనిస్తున్నాడు.

"నీవు మాత్రం చిన్నేనివా, ఓ దుకాణం, దానికో గోదాం. బిం.కాం. చదవుతున్న కొడుకు, రేపు ఎం.బి.ఎ. చేస్తాడులే" మాటలు మార్చుతూ.

"ఏం చదువుతాడో మొన్న ఓ సబ్జక్స్ తప్పాడు".

"అరె అలాగ !"

"వాండెం తప్పులేదు సార్, దిక్కు మాలిన నాదే తప్పు సార్. అక్కడ కాలేజి చదవాలి, ఇక్కడ వ్యాపారంలో సహాయం చెయ్యాలి".

"చదువుకునే కుర్రాళ్ళకి వేరే పని చెప్పొద్దు".

"మేం చెపుతాం సార్, వాల్ళంతట వాళ్ళే వచ్చి అదో యిదో చేస్తుంటారు".

"అలా కూడ చెయ్యనియ్యొద్దు. అసలు వీళ్ళను దూరంగా వుంచాలి. మా పెద్ద అబ్బాయి గూడ యింటర్ కాగానే శలవుల్లో బీబీనగర్ దగ్గర వున్న మా ఫ్యాక్టరీ దగ్గరికి వెడతానని, నా స్కూటర్ అడిగే వాడు. నేను వెళ్ళనియ్యక పొయ్యేది. డొనేషన్సు ముఖం చూడకుండా వాణ్ణి బెంగుళూరులో బి.టెక్.లో చేర్పించాను. ఆ తర్వాత రెండవ వాడు, హైదరాబాదులో మాదో చిట్‌ఫండ్ కంపెనీ వుంది. అక్కడికెళ్ళి కూర్చునేది. మన చిట్‌ఫండ్ అలా నడుస్తుంది, యిలా నడుస్తోందని యింటి దగ్గర తల్లితో చెప్పేవాడట. అది తెల్సి వాన్ని గూడ యిక్కడ వుండకుండా మద్రాసులో ఎం.బి..బి.ఎస్.లో మొన్ననే చేరిపించా. ఏదో దేవుని దయవల్ల యిద్దరు పెద్ద చదవుల్లో చేరిపోయారు. పోతే, అమ్మాయి ఎస్.ఎస్.సి. చదువుతుంది. అది మాతోనే వుందనుకో!"

"ఆడపిల్లలు ఫర్వాలేదులెండి. చదివించే వరకు చదువుకుంటారు".

"ఆ తర్వాత ఓ మంచి సంబంధం చూసి బంజారా హిల్స్‌లో ఓ యిల్లుంది, దాన్ని కట్నం కింద యిచ్చేస్తే ఫినిష్. మన బాధ్యతలు తీరినట్లే. అంతా వాని చలువే".

"బాధ్యతలు ఓనాడు తీరుతాయా సార్, చచ్చిందాక వుంటాయ్." అంటూ ఎసిటివో కళ్ళలోకి చూశాడు.

"ఏదో మనిషై పుట్టినందుకు మన పనులు మనం చేసకుంటూ పోవాలి. మిగతాది ఆపై వాని యిష్టం".

"ఓ యిద్దర్ని పిలుస్తావా ! పంచనామా రాస్తాను".

"ఏం రాస్తారుసార్? యింత చెప్పినా మీరు మళ్ళీ మొదటికొచ్చారు."

"అంటే కేసు రాయనని చెప్పానా ?"

"మీరట్లంటే మేం ఎట్లా బతుకుతాం సార్. ఓ బిల్ అటు యిటు. మీ కంటే మీ తాత, తండ్రీ సంపాదించి మీకిచ్చారు దాన్ని మీరు.."

"ఏంటి తాత... తండ్రి సంపాయించి యిచ్చారా ?అబ్బే అదేం లేదు. మా నాయనగారు నా చిన్నప్పుడే పోయారు. వీటన్నిటిని నేను నా స్వయంగా సంపాదించుకున్నా. నా యిర్వై ఏండ్ల సర్వీసులో ఎంతో కష్టపడ్డా. ఆపైన ఆదేవుని దయ".

నారాయణకు ఓ మాదిరి నవ్వొచ్చింది. కాని దాన్ని లోలోపలనే అణుచుకున్నాడు. అంతలోనే ఓ పంది కొక్కు కొబ్బరి ముక్కను నోట కర్చుకొని, ఓ మూల నుండి మరో మూలకు పరుగెత్తింది.

"అయినా మీరు అంశమంతులు సార్ !
కష్టపడితే మాత్రం శ్రీమంతులవుతారా ?
కష్టపడుతూనే పస్తుండే వాళ్ళెంత మంది ?"

వాచ్ చూసుకొని "చాలా టైమైంది పిలు, పిలు. పంచనామా పూర్తి చేయాలి".

"వొద్దు సార్ యీ సారికి వొదిలే యండి. యికనుండి కరక్టుగా వుండేటట్టు చూస్తాను".

"కేసు కావాలని చెప్పానుగా?' అంటూ వ్రాస్తూ పోతున్నాడు.

"సార్ సార్ " అంటూ నారాయణ ఆఫీసర్ చేతులు పట్టుకోబోగ-

"చెప్పేది వినవయ్యా, ఏం కాదు. ఫైన్ పడతది" అంటూనే రాస్తూనేవున్నాడు.

పక్కనే నిలుచోని చూస్తున్న ప్రసాద్ ఓపికను కోల్పోయి-

"నాన్నా, రాసుకోనీ - మనం వో దొంగ తనం చెయ్యలేదు, టాక్స్ ఎగ్గొట్ట లేదు. పావలా వీళ్ళకిచ్చి ముప్పావలాను మిగిలించుకోలేదు. ఏదో పొరపాటైంది. అంతే -"

"ఎగ్గొట్టే ఉపాయంతోటే అలా చేస్తారు".

" మేము అలా ఎగ్గొట్టి ప్రభుత్వాన్ని మోసం చేస్తే

ఈపాటికి మాకు బంగళాలుండేవి, ఫ్యాక్టరీలుండేవి, చిట్‌ఫండ్ కంపెనీలుండేవి ! మేము పెద్ద పెద్ద డొనేషన్స్ కట్టి పెద్ద చదువులే చదివే వాళ్ళం ! తరతరాల నుండి ఈ బేరం ఎందుకు చేస్తూ వుండేవాళ్ళం ? మేమూ ఎంతో సంపాయించే వాళ్లం. గోదాముల్లో సరుకులను బ్యాంకుల్లో కుదువ వుంచే వాళ్ళమా ? అందుకే కేసు రాయండి".

రాయడం ఆపి ప్రసాద్ వైపు చూస్తున్న ఎ.సి.టి.వో. గారి గొంతులో తడారింది. మెల్లగా జేబులో చెయ్యి పెట్టి యింతకు ముందు నారాయణ యిచ్చిన నోట్లను తీసి తన ముందున్న డబ్బా మీద పెట్టాడు.

ప్రసాద్ మాట్లాడుతూనే వున్నాడు.

"కోర్టు కెక్కించండి. అన్నీ మేము అక్కడే చెపుతాం. అసలు ఎవరు టాక్స్ ఎగ్గొడుతున్నారు? ఎలా ఎగ్గొడుతున్నారు ? అలా ఎగ్గొట్టమని దారులు చూపించి దానిని చట్టం దృష్టి నుంచి తప్పించి, వాటాలుగా పంచుకొని, ఆడంబరమైన జీవితాలను ఎవరు గడుపుతున్నారో! ఎవరు ఆస్తులు సంపాదించుకుంటున్నారో? అన్నీ ఎంక్వైరీ కావాలి. మనుషులను మోసం చేసి సంపాదిస్తూ దేవుని దయంటూ బుకాయిస్తున్న దెవరో" ప్రసాద్ యింకా మాట్లాడుతూనే

పున్నాడు.

ఎసిటివో గారి వళ్ళంతా చెమట పట్టింది. "రేపు ఆఫీసుకురండి" అంటూ మెల్లగా లేచి కాగితాలను చంకన పెట్టుకొని, దస్తీతో నుదురును తుడుచుకుంటూ బయటికి నడిచాడు.

నారాయణ నోరు విప్పలేక నిలుచుండిపోయాడు.

ప్రసాద్ చూపులు ఎసిటివోనే వెంటాడుతున్నాయి.

1993